

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 | డిసెంబరు, 2013 | సంచిక : 7

(విజయ నామ సం॥, మార్గశిర మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**శ్రీ ఆర్. వెంకట శివప్రసాద్**

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .................... 2

అరిగిపోయిన ఆత్మకథ .................... 5

శ్రీ సాయి సేవ .................... 8

షిరిడీ (కపర్దే) డైరీ .................... 11

స్వరాంజలి-రేవు చేరేనా.................... 14

అభిమాన తర్పణం .................... 15

మాతృసంస్థ కబుర్లు .................... 18

శ్రీ సాయితో తర్ఖడ్ స్మృతులు-7 .26

శ్రీ గజానన విజయం .................... 30



సాయి వాణి



# మా వాణి



ప్రియ పాఠకభక్తులందరికీ శ్రీ దత్తానుగ్రహ ప్రాప్తిరస్తు!

"మాసేషు మార్గశీర్షోఽహమ్" అన్నాడు కృష్ణ పరమాత్ముడు. మోక్ష మార్గానికి శీర్షం-శిరస్సు యీ నెల. విశ్వమంతటికీ జ్ఞానజ్యోత్స్నలను వెదజల్లిన భగవద్గీత ఉదయించినది యీ మాసంలోనే. ముగ్గురయ్యల శక్తులూ పొదువుకొని ఏకరూపాన నిలచిన దత్తస్వామి అవతరించినదీ యీ నెలలోనే. మన ఆరాధ్యదైవం శ్రీ సాయినాధుల వారు తాము మృత్యుంజయులమని నిదర్శనం ఇవ్వడానికి తనువు విడిచి ప్రాణాన్ని పైకి తీసుకువెళ్లి, మూడు రోజుల తరువాత తిరిగి వచ్చిన సంఘటన జరిగిందీ యీ నెలలోనే. ఇన్ని విధాలుగా మనకు మార్గశిర మాసం పవిత్రాతి పవిత్రమైపోయింది.

గీతా మాత ప్రపంచానికి భారత భూమి అందించిన మహోత్తమ కామధేనువు. పిండుకోగలిగిన వారికి పిండుకోగలంతగా అత్యద్భుతమైన జ్ఞాన క్షీరసుధ లభిస్తుంది. "కష్టకాలంలోనే గాదు-అనునిత్యం యిది నన్ను కన్న తల్లిలా కాపాడింది. అవసరమైనప్పుడల్లా సలహాలనిచ్చింది" అన్నారు గాంధీజీ. మానవ జీవితంలో అడుగడుగునా ధర్మాధర్మాలకు, యోగ్యతా యోగ్యతలకు ఘర్షణ తప్పదు. ఆ కౌరవ పాండవ యుద్ధంలో నరుడు అదరకుండా, బెదరకుండా, సుస్థిరంగా నిలబడి తన కర్తవ్యం నిర్వహించే శక్తి భగవద్గీతే యివ్వగలదు. గీతాబోధ చివర అర్జునుడు తనలో ఏర్పడిన క్లైబ్యాన్ని విడిచిపెట్టి, జూలు విదిలించి లేచిన కొదమసింగంలాగ రౌద్రంతో కాకుండా-ద్వైతభ్రాంతి నివృత్తిపొందిన యోగిలాగా నిర్మల తేజస్సుతో యుద్ధానికి సిద్ధమయ్యాడు. దీనికి కారణం గీతలోని నిష్కామ కర్మయోగ,

జ్ఞానయోగాల మేలి కలయికను అతడు మనసుకు పట్టించుకోవడమే. అప్పటెప్పటి మాటో ఎందుకు-నిన్న మొన్న బ్రిటిషు వారి చేతులలో ఉరికంబాలెక్కిన మన విప్లవ వీరులందరూ కూడా భగవద్గీతను ఎదకు హత్తుకొనే ఉరిత్రాడు తగిలించుకొనేందుకు మనఃపూర్వకంగా సన్నద్ధులయ్యారు గదా! అటువంటి సుదృఢమైన, ఆనందంతో స్వీకరించగల కర్తవ్య నిష్ఠను గీత ప్రసాదిస్తుంది. కనుక బాల్యం నుండీ గీత నేర్పడం చాలా అవసరం. అసలు పాఠ్యపుస్తకాలలోకి గీతాబోధ వెళ్లేలా చూడటం సర్వోత్తమం.

దత్తాత్రేయ మూర్తి సృష్టి, స్థితి, లయాలు మూడింటినీ కలుపుకొని, వాటికి అతీతంగా నిలచిన ఒక అద్భుతశక్తి. మనిషి లోపలి కుసంస్కారాలను తొలగించి యోగ్యులను చేయటం యీ అవతార విశిష్టత. అయితే తన బోధ, తన ఆశీస్సు పొందే యోగ్యత అవతలి వారికి ఉన్నదా లేదా అన్న పరీక్షలు పెట్టటంలో కూడా శ్రీ దత్తుల ప్రత్యేకత ఉన్నది. పరీక్షా కఠినుడు అంటారు ఈయనను. యోగిరాజుగా ఎంత గంభీరుడో, పరీక్షలలో ఎంత కఠినుడో, జంభాసుర సంహారాదులలో ఎంతటి యుక్తిపరుడో, బోధలలో ఎంతటి మహాజ్ఞానో, "నాకు ఇరవై నలుగురు గురువులున్నారు"-అనగలంత వినయశీలి కూడా. అత్యంత హేయమైన ఆకృతులలో కన్పించి భయపెట్టి ఆ భయానికి అతీతంగా తన బాహ్యావృత్తినిగాక ఆంతరిక శక్తిని గ్రహించగల వారికి కొంగుబంగారమయ్యాడు దత్తుడు. అసలు ఆయన జననమే ఒక పెద్ద బోధ మనకు. త్రిగుణ సంపుటికి అతీతుడై నిలిచిన మహర్షి అత్రికీ, అరిషడ్వర్గంలో అత్యంత బలమైన మాత్సర్యానికి అతీతంగా నిలచిన అనసూయకూ జన్మించటంలోనే వారో గొప్ప సందేశాన్ని-నీవు, నేను, వాడు అనే భేదాలకు అతీతస్థాయిలో, అసూయకు అందకుండా జీవించే వారికి తాను స్వయంగా దత్తుడినవుతానన్న విషయాన్ని స్పష్టం చేసాడు శ్రీదత్తుడు. అటువంటి స్వామి పృథ్విపై ఆవిర్భవించిన మార్గశిర పూర్ణిమనాడే -





రాత్రి పదిన్నర గంటల వేళ - శ్రీ సాయినాథుల వారు "మహల్సా, నేనీ శరీరం విడిచి బయటకు వెడుతున్నాను. మూడు రోజుల తరువాత వస్తాను. వస్తే సరే-లేకపోతే నా శవాన్ని ఫలాన చోట పాతిపెట్టు" అని స్థల నిర్దేశం కూడా చేసి, మెల్లగా మహల్సాపతి మీదికి ఒరిగిపోయి ప్రాణాలు విడిచారు. భక్తులంతా దుఃఖమగ్నులయ్యారు. మరునాటి ఉదయం వైద్యులు వచ్చి సాయి మృతి చెందారని నిర్ధారించారు కూడా. అంతలో కొందరు గ్రామీణులు-సాయి పట్ల ఈర్ష్యాళువులైన వారు-శవాన్ని తొందరగా పాతి పెట్టాలని గొడవ ప్రారంభించారు. కానీ, మహల్సాపతి "నా స్వామి వస్తానన్నారు-తప్పకుండా వస్తారు. మూడు రోజులు పూర్తయ్యే వరకు సాయి శరీరాన్ని ముట్టేందుకు వీలులేద"ని పట్టుపట్టాడు. భక్తులంతా భజనలు, ప్రార్థనలు, సంకీర్తనలు చేస్తూ మూడు రోజులూ గడిపారు. చెప్పిన గడువుకు సాయి నిద్ర నుండీ లేచి కూర్చున్నట్లుగా లేచారు. దానితో "శ్రీ సాయినాథ మహరాజ్‌కీ జై" అన్న జయజయధ్వానాలతో మారుమ్రోగింది. ఆనందోత్సాహాలతో భక్తులు ఉన్మత్తులలాగా నాట్యం చేసారు. పదేపదే శ్రీ సాయి పాదాల ముందు సాష్టాంగ నమస్కారాలు చేసారు. తమ మీది కరుణతో సాయి మళ్లీ వచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పకున్నారు. శ్రీ సాయిని అంతరవకు సామాన్య మానవునిలా భావించిన వారు కూడా ఆయన మ్రోల వినమ్రులైపోయారు.

శ్రీ సాయి దత్తావతారాలలో పరిపూర్ణావతారంగా చెప్తారు విజ్ఞులు. ఆయన ద్వాపరంలో తాను చెప్పిన గీతను ఆచరణ రూపంలో చూపించేందుకై అవతరించిన శ్రీ మహావిష్ణువేనని అన్నాడు సచ్చరిత్రకారుడు. తాను స్వయంగా పరమశివుడు మృత్యుంజయుడిననీ, కాలుడూ, కాలాతీతుడూ కూడా తానేననీ తమ యీ మూడు రోజుల తాత్కాలిక సమాధి వృత్తాంతం ద్వారా ఋజువు చేసుకున్నారు. అందుచేత మార్గశీర్ష మాసమంతా శ్రీ సాయి శక్తిమయమే. ఆ స్వామిని నిరంతరం స్మరిస్తూ సత్ఫలితాలు పొందుదాం.

# అరిగిపోయిన ఆత్మకథ

**- అరవింద**

“ఆఁ ఆఁ ఆఁ ..... మొత్తం మీద మనుషులనిపించుకొన్నారర్రా!” అలా విసిరిపడేస్తారా? అవును మీకు విశ్వాసం అనే మాటకు అర్థం తెలియదని మా పూర్వులంతా చెప్తూనే ఉన్నారు. అయినా సరే - చెల్లిపోయినంతకాలం మా అంతవారు లేరని ఎంతో దర్జాగా, ధీమాగా బ్రతికాను. ఇలాంటిరోజొకటి వస్తుందని వినికిడి ద్వారా, చూడటం ద్వారా తెలిసినా గానీ- అనుభవంలోకి రాగానే బాధ కలుగుతోంది. దీన్నేగా మీ వేదాంతులంతా మాయ అనేది!

అసలు నేనెప్పుడు పుట్టానో నాకు తెలియదు. నాకు ఊహ తెలిసేటప్పటికి మా జాతి ప్రభ వెలిగిపోతోంది. నా మటుకు నేను ఎంత వైభవంగా ఉన్నాననుకొన్నారు! నేను క్రొత్తగా తళతళలాడిపోతూ ఎంచక్కా ఉన్నానని పదిలంగా దాచుకొన్నారు కొన్నాళ్లు. ఆ తరువాత మాత్రం ఎంత గౌరవంగా చూచారని! పొరపాటున తమ చేతిలోంచీ జారిపడితే ఎంతో పదిలంగా తీసి చటుక్కున కళ్లకద్దుకొని మరీ జేబుల్లో వేసుకొనేవారు. పిల్లలెవరైనా నన్ను విసిరిపడేస్తే పెద్దవాళ్లు ‘లక్ష్మీదేవిని అలా విసిరికొడతార్రా వెధవల్లారా!” అని తిట్టేవారు. నా విలువ ఎంతో, నా వలన వాళ్లకు ఎన్నెన్ని సామాన్లు వస్తాయో లెక్కలు విడమరిచి చెప్పేవారు. నన్ను శుభ్రంగా తుడిచి, కళ్లకద్దుకొనేవారు.

సాయిబాబా గుడిలో హుండీలో ఉన్నానొక వారమో, రెండు వారాలో. బాబా చరిత్ర పారాయణ జరిగేదక్కడ ప్రతిరోజూ. అందులో రెండు మూడు చోట్ల నా ప్రసక్తి వచ్చింది. బాబావారు తమ అవసాన దశలో లక్ష్మీబాయి షిండే అనే భక్తురాలికి తొమ్మిది రూపాయలు (నవ విధ భక్తులకు గుర్తుగా) ఇచ్చి భద్రంగా దాచుకొమ్మన్నట్లు ఉన్నది. ‘ఆ నాణేలు ఇప్పటికీ షిరిడీలోని లక్ష్మీబాయి షిండే యింట్లో పటం కట్టించి మరీ ఉన్నాయని భక్తులు అనుకోగా విన్నాను. బాబా పూజలో రెండు నాణేలు-వాళ్ల వాళ్ల శక్తిని బట్టి ఏవైనా సరే నాణేలు దక్షిణగా పెట్టాలనీ, అవి భక్తులు చూపవలసిన శ్రద్ధకూ, సాబురీలకు గుర్తులనీ పూజారి భక్తులకు చెప్పటం విన్నాను. భక్తులు తమ శ్రద్ధనూ, సహనాన్నీ కళ్లకు చూపించలేరు గనుక వాటికి ప్రతీకలుగా మమ్మల్ని సమర్పించుకొమ్మని చెప్పి ఉంటారు పెద్దలు. అలా పెట్టే సమయంలోనైనా తమకు విశ్వాసం, సహనం ఉండాలన్న సంగతి భక్తులకు గుర్తు రావాలని వాళ్ల ఉద్దేశ్యమై ఉండవచ్చుననిపించింది నాకు. కానీ, యీ నాణేలతో సరిపెట్టేసి అసలు దక్షిణలైన శ్రద్ధా, సహనాలను పూర్తిగా మర్చిపోయే భక్తులను కూడా నేనక్కడ చూచాను. ‘అయ్యో, ఈ దక్షిణ వ్యవహారం కాస్తా శుద్ధ యాంత్రికంగా మారిపోయిందే!’ అని బాధపడ్డాను కూడా.

బాబావారు అప్పడప్పడూ తమ దగ్గరున్న కిలుం పట్టిన నాణేలను రాతి మీద రుద్దుతూ ‘ఇది శ్యామా, ఇది నానా-ఇది తాత్యా’ అంటూ ఉండేవారని విన్నాను. శిష్యులు ఏవో లౌకిక వ్యామోహాలలో పడి కూరుకు పోతున్నపుడు వారిని రక్షించడానికి ఆ పరమ సద్గురువు ఇలా చేసి ఉంటారనుకొని, ఆ స్వామి ప్రేమకు ముగ్ధురాలనై, ఆయన సన్నిధానంలో కొంతకాలం ఉన్నందుకు ధన్యురాలనయ్యాననుకొన్నాను. అంతేకాదు- ఆయన చరిత్రలో మాకు కొంతచోటు అనేక రకాలుగా దొరికినందుకు ఆనందించాను కూడా. ఆ తరువాత కొన్నాళ్లు ఎక్కడెక్కడో చేతులు మారుతూ తిరిగాను. నాపైనున్న బొమ్మ ఒక మహానుభావుడిది. అదీ నాకు గర్వకారణమే. ఎన్నెన్నో తీర్థక్షేత్రాలు తిరిగాను. ఎందరికో ఆకలి తీర్చాను. ఎందరికో మందులకు పనికి వచ్చాను. ఎందరికో విద్యాదానానికి ఆసరాగా నిలిచాను. ఇంకెందరికో వస్త్రాన్నై కాపాడాను. అలా అలా అలా పనిచేస్తూ చేస్తూ యిప్పుడిలా అరిగిపోయాను.

మీరు మీ నాణేల తీరు మార్చుకొన్నారు. విలువలు మార్చుకొన్నారు. మనుష్యులు గదా - కొత్త కొత్త వాటి మీద మోజుపడటం మీకు సహజ లక్షణం. మొబైల్ సెల్‌ఫోనులు రాగానే అంతదాకా ఉన్న లేఖల మాధుర్యాన్నీ, ఆ ఎదురుతెన్నులలోని సౌందర్యాన్నీ మర్చిపోయారు. లేఖల్లోని సాహిత్యాన్నీ, వాటి శాశ్వతత్వాన్నీ, తిరిగి తిరిగి చదువుకోగలిగే ఆనందాన్ని నెట్టిపారేసారు. అలాగే టెలిగ్రాం అన్నదాన్ని వ్యర్థం పొమ్మనుకొన్నారు. రోజుకో రకంగా మీరు విలువలు మార్చుకొంటూ పాత వాటినన్నిటినీ విలువలేనివంటున్నారు. అయినా-మీకిదో లెక్కా! మిమ్మల్ని ఎంతో లాలించి, ప్రేమించి, పెంచిన అయ్యమ్మ, అమ్మమ్మలు, తాతయ్యలు మీ ప్రాణానికి కేవలం వాడి పారేసిన వస్తువులతో సమానం. నా మొహం-తాతలూ, అవ్వలేమిటి-తల్లిదండ్రులకే ఆ గతి తప్పకపోతే! చిన్నప్పడు ఎంతో ప్రీతిగా, ముద్దుగా తొక్కిన మూడు చక్రాల సైకిలు ఇప్పడు మీకు అక్కర్లేదు. కానీ-ఏదో బంధం-అందుకని పారెయ్యలేరు. అలాగని ఇంట్లో నలుగురికీ కనిపించేలాగానూ పెట్టరు. ఎక్కడో అటక మీద దాస్తారు. అలాగే మీ ఇళ్లలో వృద్ధులు కూడా ఏదో ఓ మూల పడి వేళకింత తిని పడి ఉండాలని అనుకొంటారు. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకొని పెంచిన వారి గతే అలా ఉంటే ఇక మేమెంత!

ఒకప్పడు-నేను చెలామణీలో ఉన్నప్పడు నేనొక మహారాణిని. నా కటాక్షం కోసం మీరు పడిగాపులు పడ్డారు. దేవుడికి ముడుపు కట్టాలంటే నేను, ఆలయ ప్రతిష్ఠలలో నేను, పిల్లల భోగి పళ్లలో నేను, తులాభారాలలో నేను - మీ భక్తికి, మీ ప్రేమకు నేనే తార్కాణాన్ని అన్నట్లు భావించేవారు. ఇప్పడో-ఏ పిల్లవాడో-ఏ పెట్టె అడుగునో నన్ను చూచి, "ఇదేమిటి నాన్నా?" అని అడిగితే-"ఆఁ, అదెక్కడ దొరికిందిరా నీకు? అవి పాత కాయిన్స్‌లే! ఇప్పడు చెల్లవు-పనికిరావు" అని జవాబు. పెదవి విరుపులు. కనీసం "మా చిన్నప్పడు ఇది తీసుకు బజారుకు వెడితే ఎంచక్కా యిన్ని వస్తువులు వచ్చేవి. ఇప్పడు పదింతలు పెడితేగానీ రావటం లేదు"-ఇలా ఓ మంచి





మాటన్నా అనరు. ఇంతకీ మీరిలా మా (పనికిరావని మీరనుకొంటున్న) ముఖాలను ఎందుకింకా దాస్తున్నారో నాకూ తెలుసుకోంచెం. "మా దగ్గర పాత నాణేలున్నాయి"అని చెప్పకొని, ఆ నాణేలు పోగుచేసే పిచ్చి వాళ్ల దగ్గర బేరం పెట్టాలని. కాదంటారా! ఓ ప్రక్క చెల్లవంటూనే మరోప్రక్క 'ఎందుకన్నా పనికిరాకపోతుందా'- అని దాయటం సెభాష్! ఎంత గొప్పదయ్యా మీ మానవజాతి! విశ్వాసం అన్న ముక్కకు అర్థం తెలియని జాతి. ఇంతకీ నా విలువ మారలేదు సుమా- తెలుసుకోండి మారింది - మీ దృష్టే!

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

(గత సంచిక తరువాయి)

లియో టాల్‌స్టాయ్ చెప్పినదే మరో విశ్వవిఖ్యాత గాథ - ఇద్దరు వృద్ధుల గురించి చూద్దాం. టాల్‌స్టాయ్ భారతీయ తత్త్వశాస్త్రం చేత అమితంగా ప్రభావితుడయ్యాడు. సోమర్‌సెట్ మామ్ రచనల్లాగే టాల్‌స్టాయ్ కథలలో కూడా భారతీయ పురాణేతిహాసాల్లో కన్పించే లోతు, దార్శనికత, స్పష్టత కన్పిస్తాయి. భారతీయ ఋషి పరంపర యొక్క భావజాలపు గాంభీర్యం యిక్కడా కన్పిస్తుంది.

ఎఫిమ్, ఎలీజా మిత్రులు. ఓసారి వారిద్దరూ ఎంతోకాలంగా వాయిదాలు వేసుకొంటూ వస్తున్న జెరూసలేమ్ యాత్రకు బయలుదేరారు. ఆర్థికంగా కాస్త బాగున్న ఎఫిమ్ తాను దాచుకున్న డబ్బు తెచ్చుకోగా,

సాధారణుడైన ఎలీజా భార్య, కోడలు ఇచ్చిన డబ్బుకు మరికాస్త తన సరుకు అమ్మి జమ చేసుకున్నాడు. తన కొడుకులకు సంసారభారం వదిలేసి నిశ్చింతగా బయలుదేరాడు. ఎన్నెన్నో జాగ్రత్తలు తన పిల్లలకు చెప్పి వచ్చిన ఎఫిమేమో వీలు చిక్కినప్పడల్లా యింటి గురించే ఆలోచించేవాడు. ఎలీజా మాత్రం మహోత్సాహంగా ఆడుతూ పాడుతూ యాత్రానందాన్ని అనుభవిస్తూ ఉండేవాడు.

అలా వాళ్ల ప్రయాణం ఒక సుభిక్షమైన ప్రాంతం గుండా సాగి సాగి చివరికొక కరువు ప్రాంతానికి చేరింది. భయంకరంగా ఉన్నాయి అక్కడి పరిస్థితులు. ప్రజలు ఎంతో మంచివాళ్లే. కానీ వాళ్లే ఎలుకల్లా మాడిపోతోంటే అతిథి మర్యాదలకు చోటెక్కడ? నిప్పలు చెరిగే ఎండలో నడుస్తున్న ఎలీజాకు విపరీతంగా దాహమైంది. అతడు "నీవు నడుస్తూ ఉండు. నేను కాస్త మంచినీళ్లు అడిగి తాగి వస్తాను" అని ఒక ఇంటివైపు వెళ్లాడు. ఎఫిమ్ ముందుకు సాగిపోయాడు.

ఎలీజా దాహార్తుడై ఎన్ని పిలుపులు పిలిచినా అతడు వెళ్లిన యింటి వారు నీళ్లిచ్చే స్థితిలో లేరు. ఆ యింటిలోని అందరూ-ఒక వృద్ధుడు, వృద్ధురాలు, వాళ్ల కోడలు-అంతా రోగగ్రస్తులై చివికి జీర్ణావస్థలో ఉన్నారు వాళ్ల శరీరాల మీది బట్టల్లాగే. ఓ చిన్న పిల్లవాడు పెద్ద గొంతుతో ఏడుస్తున్నాడు. ముసలామె ఎలాగో గొంతు పెగల్చుకొని "చుట్టూ ఉన్న కరువుతో తామిలా ఎండిపోయామ"ని తడబడుతూ చెప్పింది.

వాళ్ల దీనదశ చూచిన ఎలీజా మనసు కరిగింది. వెంటనే వెళ్లి వంటకు కావలసిన వస్తువులు కొని తెచ్చాడు. కొన్ని కట్టెలు కొట్టి, పొయ్యి అంటించి, జావ కాచాడు. సూప్ తయారుచేసాడు. తన దగ్గరున్న రొట్టెను ముక్కలు చేసి అందరికీ పంచాడు. మొత్తం మీద చాలా రోజుల తర్వాత వాళ్లంతా ఎంగిలిపడ్డారు. అటుపైన ముసలాయన కాస్త తేరుకుని, కరువెలా వచ్చిందో, తామంతా అప్పల్లో ఎలా కూరుకుపోయారో, ఆకలికి





ఆకులు, గడ్డి ..... ఏది పడితే అది తిని ఎలా రోగాల బారినపడ్డారో పూర్తిగా వివరించాడు. అదంతా విన్న ఎలీజా తాను కొద్దిరోజులపాటు వాళ్లకు సాయపడుతూ అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాడు.

తన దగ్గరున్న డబ్బులో కొంత ఖర్చుచేసి అతడు ఇంటికి కావలసిన సరుకులన్నీ కొన్నాడు. వాళ్లంతా కోలుకొనే వరకు వాళ్ల యింటి పనులలో కూడా సాయపడుతూ గడిపాడు. అమ్మాయితో పాటు నీళ్లు మోసాడు. గృహిణికి వంటపనిలో తోడ్పడ్డాడు. మెల్లమెల్లగా అందరూ చక్కగా కోలుకొన్నారు. ఎలీజా ఎఫిమ్‌ను గుర్తు చేసుకున్నాడు. అతనెంత దూరం వెళ్లిపోయాడో ఏమో-తాను కూడా వెళ్లి అతన్ని కలుసుకుందామనిపించింది.

కానీ ఆ మరునాడు ఏదో పండుగ రోజయింది. ఉన్నన్నాళ్లూ ఉండి పండుగ పూట వాళ్లని వదిలివెళ్లటం ఎందుకులే అనిపించిందతనికి. చక్కని విందు భోజనం ఏర్పాటు చేసాడు అందరికీ. ఆ రాత్రి తాను వెళ్లిపోతే వాళ్ల పరిస్థితి ఎలాగా అన్న బాధ అతన్ని పీకసాగింది. వాళ్ల భూమి తాకట్టులో ఉంది. అది విడిపించకపోతే వాళ్లకు జీవనాధారం ఉండదు.

ఎలీజా సందిగ్ధంలో పడ్డాడు. ఆ భూమి విడిపించి యివ్వాలంటే - తానిక యాత్రకు వెళ్లలేడు. తన దగ్గరున్న డబ్బు రెండింటికీ సరిపోయేంతగా లేదు. ఆ రాత్రి నిద్రలో అతనికి తాను యాత్రకు వెడుతున్నట్లూ, ఆ యింటి చిన్న పిల్లలిద్దరూ కాళ్లకు అడ్డుపడుతున్నట్లూ కల వచ్చింది. నిద్ర లేచాక ఎలీజా మనసులో అనుకొన్నాడు-"వీళ్లందరినీ యింత దీనావస్థలో వదిలిపెట్టి, మానవత్వం చచ్చిపోయిన హృదయంతో నేను యాత్ర చేసి పొందగలిగే ప్రయోజనం ఏమిటి? ఇంకెక్కడ క్రీస్తును పొందగలను!" అతడు ఒక స్థిర నిర్ణయానికి వచ్చాడు.

ఆ నిరుపేద కుటుంబం వారి భూమిని విడిపించాడు తాకట్టు నుండి. ఒక గుర్రాన్నీ, బండినీ, ఒక ఆవునూ కొన్నాడు. గ్రామీణులంతా ఒక కుటుంబాన్ని కాపాడినందుకు ఎలీజాను ఎంతగానో అభినందించారు.

ఎలీజా తానిక యాత్రకు వెళ్లలేననుకొన్నాడు. ఈ మిగిలినకొద్ది డబ్బా చాలదెలాగూ. "పోనీలే పరమాత్ముడు ఈ కుటుంబాన్ని కరుణించాడు. నా మిత్రుడు ఎఫిమ్ నా బదులుగా కూడా పవిత్ర ప్రదేశంలో దీపాలు వెలిగిస్తాడులే" అనుకొని సంతృప్తితో యింటిదారి పట్టాడు. "నా మొక్కు అలా తీర్చకుండానే నేను చచ్చిపోతానేమో! అయినా ఫర్వాలేదులే" అని తనకు తానే నచ్చజెప్పకొన్నాడు.

వచ్చేటప్పుడు ఎలా ఆనందంగా పాటలు పాడుతూ వచ్చాడో అలాగే యింటికి వెళ్లాడు. అతడు తిరిగి వచ్చినందుకు కుటుంబీకులంతా ఆనందించారు. తన మిత్రుడూ, తానూ దారిలో విడిపోయామనీ, తన దగ్గరున్న డబ్బు చాలకపోవటంతో తాను తిరిగి వచ్చాననీ ఎఫిమ్ గురించి అడిగిన వాళ్లకు చెప్పాడు ఎలీజా.

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

23-12-1911

పెందలకడనే లేచాను గానీ, మళ్లీ నిద్రవచ్చి పడుకొని ఆలస్యంగా లేచాను. క్రిందికి వచ్చేసరికి షిన్గ్నే, అతని భార్య, దర్వేష్ సాహెబ్ ఇళ్లకు వెళ్లడానికి అనుమతి పొందారని తెలిసింది. షిన్గ్నే బొంబాయికీ, దర్వేష్ కళ్యాణ్‌కే వెళ్లిపోయారు. దర్వేష్ ఆధ్యాత్మికంగా చాలా ముందున్నాడు. సాయి మహరాజు అతను వెళ్లిపోయేటపుడు గోడ పగులు దాకా వచ్చి దానిలోంచీ చూస్తూ నిలబడ్డారు.





మేము చాలాసేపు మాట్లాడుకొంటూ ఉండేవాళ్లం గనుక నాకు లోటుగా అనిపించింది దర్వేష్ లేకపోవటం. బొంబాయిలో సొలిసిటర్‌గా ఉన్న మంత్రి అనే ఆయన తన నలుగురు తమ్ముళ్లు, చాలా మంది పిల్లలు, భార్య, కుటుంబంతో కలిసి నిన్ననే వచ్చాడు. ఆయన మంచి మనిషి. మేము మాట్లాడుకొంటూ కూర్చున్నాము. గత సంవత్సరం యిక్కడ నేను కలుసుకున్న మహాజని అనే ఆయన ఇవ్వేళ వచ్చాడు. చాలా మంచి పండ్లూ, సాయిబాబా దీపాలకు చక్కని గాజుబుడ్లూ తెచ్చాడు. భయాండర్ నుంచీ గోవర్ధన దాసు కూడా వచ్చాడు. ఆయన చావడిలో సాయి మహరాజు కోసం తయారైన గదికి సిల్కు తెరలు, అక్కడ ఛత్రం, చామరాలు, పంకా పట్టుకొనే వాలంటీర్ల (స్వచ్ఛంద కార్యకర్తల)కు క్రొత్త బట్టలు, చక్కని పళ్లు తెచ్చాడు. అతను చాలా ధనవంతుడంటారు. మాధవరావు దేశ్‌పాండేకూ మా ఆవిడ, పిల్లలకూ దీక్షిత్ వాడాలో నివాసం గురించి ఏదో అర్థం లేని పేచీ ఉంది. సాయిబాబా దీక్షిత్ వాడా మాధవరావుదీ కాదు - దీక్షిత్‌దీ కాదు - తమదేనన్నారు. దానితో విషయం తేలిపోయింది. బాబా బయటికి వెళ్లేటపుడు నాకు కన్పించ లేదుగానీ తిరిగి వచ్చాక చూచాను. వారు నాకు పండ్లు, తమ చిలుంలో కొద్ది పొగా యిచ్చారు. మధ్యాహ్నం భోజనానంతరం కొద్దిగా నిద్రపోయి లేచి ఇవ్వేళ్టి వార్తాపత్రికలు చదువుతూ కూర్చున్నాను. వామనరావు పటేల్ ఎల్.ఎల్.బి. పాసయ్యాడు. డా॥ హాటే కూడా పాసైతే బావుండునని నేననుకున్నాను. సాయిమహరాజు అతనికి చాలా మంచి కబురు వస్తుందన్నారు. టిప్నిస్ భార్య కొంచెం మెరుగైంది. వాళ్లు విడిది మార్చుకున్నారు. ఆమె యింతకుముందున్నంత చికాకుగా లేదు. రామ్‌మారుతి బువా యింకా యిక్కడే ఉన్నాడు. మేమందరం కలిసి శేజారతికి వెళ్లాం. క్రొత్త బట్టలు, క్రొత్త తెరలతో ఊరేగింపు అందంగా ఉంది. నేను చాలా ఆనందించాను. అలాంటి ఖరీదైన వస్తువులు కానుకలుగా యిచ్చే శక్తి నాకు

లేనందుకు నేను విచారించాను. భగవంతుడు గొప్పవాడు. రాత్రి భీష్మ భజన, దీక్షిత్ రామాయణం మామూలుగానే నడిచాయి.

24-12-1911

ప్రొద్దున్నే లేచి కాకడ హారతికి వెళ్లాను. తిరిగి వచ్చి అలా నడవటానికి వెళ్లాను. మంత్రికి తిరిగి వెళ్లడానికి అనుమతి దొరికింది. దాదాపు ప్రతి వారికీ వీడ్కోలు చెప్పి, వారు వెళ్లిపోయారు సకుటుంబంగా. ఆయన చాలా చాలా మంచి మనిషి. వామనరావు పటేల్ కూడా వెళ్లిపోయాడు. ఇవ్వేళ చాలామంది సందర్శకులు వచ్చారు. వారిలో అనసూయాబాయి అనే ఆమె ఉన్నారు. ఆమె ఆధ్యాత్మికంగా ఎదిగిన వ్యక్తిలా కన్పించారు. సాయి మహరాజు ఆమెను విశేషాదరణతో చూచి, నాలుగు పళ్లిచ్చారు. తరువాత సాయి ఐదుగురు కొడుకులున్న ఒక తండ్రి కథ చెప్పారు. వాళ్లలో నలుగురు తమతమ వాటా ఆస్తులు అడిగి పంచుకున్నారు. మళ్లీ అందులో యిద్దరు తండ్రితో తిరిగి కలవాలనుకొన్నారు. తరువాతివాడు ఆ యిద్దరిలో ఒకరికి విషం పెట్టమని చెప్తే తల్లి ఒప్పుకున్నది. మరొకడు చెట్టు మీది నుంచీ పడిపోయి చచ్చిపోయే దశకు వచ్చాడు. కానీ తండ్రి అతన్ని పన్నెండేళ్లపాటు రక్షించాడు. వాడికి ఒక కొడుకు, కూతురు పుట్టాక వాడు చచ్చిపోయాడు. సాయిబాబా ఐదవ కొడుకును గురించి ఏమీ చెప్పలేదు. ఈ కథ అసంపూర్ణంగా అనిపించింది నాకు. మధ్యాహ్న భోజనానంతరం కాస్సేపు పడుకొని లేచి రామాయణం చదువుతూ కూర్చున్నాను. సాయంత్రం మామూలుగా చావడి ఎదురుగా నిలబడి సాయికి నమస్కారం చేసుకున్నాం. భీష్మ భజన, దీక్షిత్ రామాయణం మామూలే. డా॥ హాటే యింకా యిక్కడే ఉన్నాడు. మహాజని కూడా యిక్కడే ఉన్నాడు.

**(సశేషం)**





# రేవు చేరేనా?

– సుమలత

*ఏ తీరున నా పడవ తీరాన జేరునో*
*నట్టనడి సంద్రాన మునిగేపొయ్యేనో* ॥ ఏ ॥
*సుక్కాని బట్టేటోడు ఒంటి కంటీవోడు*
*తెడ్డు ఏసేటోడు తుంటి సేతీవోడు* ॥ ఏ ॥
*తెరసాప నిండుగా కన్నాలు మెండయ్యా (2)*
*సూది దారం పట్టేటి సైదోడు లేడయ్యా* ॥ ఏ ॥
*కేవు చేతినిండా పుచ్చుకున్నాడూ (2)*
*రేవు జేర్చే దేవుడంటే రేపు రేపంటాడు* ॥ ఏ ॥
*సరంగుకే మొరబెట్టుకుందామంటే ..... (2)*
*తనువుతో కనరాడూ పెనుమాయగాడూ* ॥ ఏ ॥
*కాదు కాదని గంగతల్లికి మొక్కుదామంటే (2)*
*ఒక్క సిటెమైనా నిలిసియినదే గోడూ*
*ఏ తీరున నా పడవ తీరాన జేరునో*
*నట్టనడి సంద్రాన మునిగే పొయ్యేనో* ॥ ఏ ॥

మానవత్వం మీద విశ్వాసం ఎన్నడూ కోల్పోకండి. మానవత్వం అన్నది ఒక మహాసాగరం వంటిది. ఏవో కొన్ని చుక్కల నీళ్ల మురికైనంత మాత్రాన సముద్రమంతా మురికినీరే అనుకోవడానికి వీలు లేదు.

# అభిమాన తర్పణం

శ్రీమతి కంఠంనేని విజయలక్ష్మి శ్రీ రఘు ఆశ్రమానికి చాలా ఆప్తులు. విజయలక్ష్మి సాయి విద్యాధామంలో కార్యకర్తగా, ఉపాధ్యాయినిగా ఉండగానే ఆమె వివాహం జరిగింది. ఇరుపక్షాల వారూ ఆప్తులే కావటంతో ఆశ్రమంతో అనుబంధం పెరిగింది. రఘు తల్లి లలితగారు చైతన్య వాహినిలాంటి వ్యక్తి-స్నేహశీలి-నిరాడంబరమైన ఆధ్యాత్మిక చింతన గల స్త్రీ. ఆమె వివాహమై 50 వసంతాలు నిండిన సందర్భంగా పిల్లలందరితో, బంధుమిత్రులందరితో కలిసి చక్కని ఉత్సవం చేసుకొన్నారు. ఆ మర్నాటి నుంచే లలిత జబ్బు బయటపడటం జరిగింది. వ్యాధిగ్రస్తులైనాక కూడా గురువుగారిని చూడాలని వచ్చింది. రెండు నెలలు మాత్రమే (లంగ్ కేన్సర్ అని తెలాక) బాధపడి ఆ పుణ్యవతి అక్టోబరు 9వ తేదీన శ్రీ సాయిదేవుల చరణాలలో లీనమై పోయారు. మేనత్త, మేనమామ బిడ్డలుగా బాల్యం నుండీ స్నేహ బద్ధులై, ఐదు పదుల దాంపత్య బంధంలో 'త్వమేవాఽహం'గా బ్రతికి, ఇప్పుడు ఒంటరిగా ఆవేదనతో మిగిలిన శ్రీ అజయకుమార్ ఘోష్ గారికి, వారి కుటుంబానికి సాయివాణి తన హార్దిక సానుభూతిని తెలియజేస్తున్నది.

మా సాయినాథ క్షేత్రం (మైనేనివారిపాలెం)లో మేము అడుగు పెట్టిననాటి నుండీ నేటి వరకు కూడా ఆశ్రమానికి పెద్దదిక్కులుగా, పరమ ఆప్తులుగా నిలబడిన పుణ్యదంపతులు శ్రీమతి సుంకర శారదమ్మగారు, శ్రీ సత్యనారాయణగారు. ఆశ్రమం చేసే ప్రతి కార్యక్రమం లోనూ వారు ఎంతో ఉత్సాహంతో, ఔదార్యంతో పాల్గొని సహకరిస్తూ ఉంటారు. ఆలయ నిర్మాణానికేగాక అనేక సందర్భాలలో తమ బంధుమిత్రులందరినీ కూడా భాగస్వాములను చేసేందుకై కృషి చేసారు. శ్రీ సత్యనారాయణగారు అంటే పచ్చని రూపం, తెల్లని బట్టలు-వృద్ధాప్యం వలన వణికే కాళ్లను లెక్కచేయకుండా కర్రపోటుతో కదలివచ్చే





అభిమానం. ఆశ్రమానికి వచ్చి చూచి వెళ్లినా సరే-గురువుగారిని మరోసారి చూడాలనే కోరిక మా కారు వెళ్లే దారిలో వీధి ప్రక్కన అరుగుల మీద కూర్చొని ఉంటారు. కారు ఆపితే వచ్చి మళ్లీ నమస్కారం చేసుకొని సంతృప్తులవుతారు. ఎనిమిది పదుల వయస్సు దాటిన శ్రీ సత్యనారాయణగారు-పచ్చని పెద్ద ముత్తైదువ శారదాంబగారిని ఏకాకిని చేసి సాయిచరణ సీమలో లయించారు. చివరిరోజులలో కూడా ఆయన "మా గురువుగారిని ఎరుగుదురా? మంచి గురువు గారు. ఆయనకు నమస్కారం చేసానని చెప్పండి" అని వచ్చిపోయే వారితో చెప్తూ ఉండటం, "ఓం సాయిరాం, శ్రీ సాయిరాం" నామాన్ని చెప్తూ ఉండటం ఆయన నిష్కల్మష ప్రేమకూ, దైవానికి ఆయనపై కలిగిన కరుణకూ గుర్తులు. మాతృ సమానురాలు మా శారదాంబగారికీ, వారి కుటుంబానికీ మా ప్రగాఢ సానుభూతిని అందిస్తున్నాం.

ఎప్పుడో ఇరవై మూడేళ్లనాడు పరిచయమైన మిత్రురాలు, చక్కని పనిమంతురాలు, స్నేహశీలి, సేవాభావం ఉన్న వ్యక్తి మా కవిత. ఆమె భర్త అనంతరెడ్డిగారు, కుమారులు రాజు, .. డా॥ సురేశ్-అందరూ కూడా ఆశ్రమానికి ఏదో ఒక రకమైన సేవను అందిస్తూనే ఉంటారు. కవిత కుమార్తె చి॥సౌ॥పద్మజ మన సాయి విద్యాధామంలో ఉపాధ్యాయినిగా, కార్యకర్తగా కూడా సేవలు అందించింది. కవిత చాలాచాలా చురుకుగా తిరుగుతుండేది. ఆమె సరిగ్గా పావుగంట సేపట్లో పధ్నాలుగు మడత చపాతీలు చేసి, ఓవైపు స్టౌ మీద కూర కూడా చేసి మాకు వడ్డించినపుడు అవి చేతులా అని ఆశ్చర్యపోయాం. ఒక్కగంటలో నూట ఎనిమిది బొబ్బట్లు మరో చిన్నపిల్ల సాయంతో చేసినపుడు "కొంపదీసి యీామె రోబట్ కాదు గదా!" అని నవ్వుకొన్నాం. నిత్యం సాయిచరిత్ర, విష్ణు సహస్ర నామాల వంటివి పారాయణ చేసేది. సాయిధామం ఆశ్రమంలో జరిగే ఏ ఉత్సవానికైనా తెల్లవారేసరికి వచ్చేసి అరబస్తా,

బస్తా-ఎన్ని బియ్యమైనా సరే-అరగంటలో వార్చేసి, మా పిల్లలకు ఎంతో అండగా ఉండేది. వాళ్లను ప్రేమతో చూచేది. ఆ చల్లని తల్లి హఠాత్తుగా కేన్సర్ వ్యాధికిలోనై ఆరు నెలలుగా బాధ అనుభవించింది. అయినా సరే మధ్యలో రెండు సార్లు వచ్చి గురుపూర్ణిమనాడు, మరోసారి గురుదర్శనం చేసుకున్నది. మాకూ పిల్లలక్కూడా ఎంతో ఆప్తంగా ఉండే కవిత తన కుటుంబాన్నీ, తన సహాయ సహకారాలు ఎంతగానో పొందిన ఎందరెందరో బంధుమిత్రులను దుఃఖంలో ముంచి అక్టోబరు 28వ తేదీ సోమవారంనాటి రాత్రి శ్రీ సాయిలో ఐక్యమైపోయింది. శ్రీ అనంతరెడ్డి గారికి, వారి పిల్లలకు మా ప్రగాఢ సౌహార్ద్ర సహానుభూతిని తెలియ జేస్తున్నాము.

బాగా ఆలస్యంగా అంది ఆవేదన కలిగించిన వార్త శ్రీమతి మేజర్ యశోధరాదేవిగారి మరణవార్త. దేశరక్షణకై మేజర్‌గా పనిచేసి, రిటైర్మెంట్ తరువాత సమాజానికి అశేష సేవలు అందించిన ధీర వనిత యశోధర గారు. ఆరేళ్లపాటు డాక్టర్ శివరామకృష్ణ శాస్త్రిగారితో కలిసి సాయిధామా నికి వారంవారం వచ్చి, యిక్కడి వృద్ధులకు వైద్యసహకారం అందించారు. జీవితమంతా ఏకాకిగా ఉండి పోయిన యశోధరగారికి భక్తిప్రపత్తులూ ఎక్కువే. పచ్చని తనువు-తెల్లని చీర-గుండ్రని ముఖం- ప్రేమతో కూడిన పలకరింపు-గొప్ప సేవాభావం-పిట్ట తిండి-ఇదీ యశోధర గారు. ఆ తల్లి ఎనభై మూడేళ్ల వయసులో కేన్సర్ బారిన పడి కాలపురుషుని గుప్పిట చిక్కి తరలిపోయారు. నెలన్నర తరువాతగానీ యీ కబురు మాకు తెలియకపోవడానికి కారణం -ఆమె ఒంటరివారు కావటమూ, ఆమె తాలూకు వారెవ్వరికీ ఆశ్రమంతో పరిచయం లేకపోవటమే. యశోధరమ్మగారి ఆత్మకు శ్రీ సాయినాథుడు శాశ్వత శాంతిని కల్గించుగాక! - అని సాయివాణి ప్రార్థన.





# మాతృసంస్థ కబుర్లు

అక్టోబర్ 6వ తేదీ ఉదయం గురుదేవులు మేడ్చల్‌లోని గట్టు మైసమ్మ ఆలయానికి యోగాచార్య శ్రీలింగంగారి అభ్యర్థనపై వెళ్లి అక్కడ అమ్మవారి సామూహిక పూజలో కూర్చున్న సుమారు మూడు వందల మంది భక్తులకు తమ ఆశీస్సులను అందించారు. శక్తి ఉపాసన దేనికి, మహిషాసురుడు మనలోనే ఎలా ఉంటాడు-వాడిని సంహరించాలంటే మన లోపలికి దేవిని ఎలా ఆవాహన చేసుకోవాలి-అన్న విషయాలపై వారు ప్రవచించారు. అవతార రహస్యాలను వివరించి, భక్తులను ఆశీర్వదించి మరలి వచ్చారు.

అక్టోబరు 9వ తేదీ ఉదయం గం.10.30కు గురుదేవులు ఎస్.పి. నగర్, మల్కాజిగిరిలోని శ్రీ సాయి దేవాలయంలో విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విశేషపూజలకు వేంచేసారు. అక్కడ సమా వేశమైన భక్తులకు బాబా బోధలను గురించీ, సామూహిక స్తోత్ర పఠనం లోని విశిష్టతను గురించీ వివరించి చెప్పారు. కొందరు భక్తురాండ్ర కోరికపై సమీపంలోని మహంకాళి దేవాలయం దగ్గరకు వెళ్లి అక్కడి భక్తులకు కూడా శక్తిరూపిణులైన ముగ్గురమ్మలను గూర్చి, వారి ఆవాహనను గూర్చి తమ ప్రవచనామృతం దయచేసారు.

11వ తేదీ ఉదయం సరస్వతీ పూజ. తెల్లని గన్నేరులు, గరుడవర్ధనలు, పున్నాగలు పోగయ్యాయి. తెల్లని పట్టుబట్టలతో సిరులు చిందే సరస్వతికి ఆశ్రమ బాలబాలికలు, మరికొందరు పాఠశాల బాలలు-అంతా తెల్లని బట్టలతో వచ్చి పూజకు కూర్చున్నారు. సరస్వతికి హంస వాహనం, తెలి పద్మాసనం, తెల్ల వస్త్రాలే ధరించటం వీటన్నిటి విశిష్టతను వివరిస్తూ సమంత్రకంగా పూజ నిర్వ హింపజేసారు పెద్దలు. తదుపరి ప్రసాద స్వీకారం చేసి పిల్లలంతా ఇళ్లకు వెళ్లిపోయారు.

అక్టోబరు 13వ తేదీన ఆయుధ పూజ సందర్భంగా సాయిధామంలోని స్కూటర్లు, కారు, బస్సు అన్నింటినీ శుభ్రంగా కడిగి అలంకరించారు. బయటి నుండీ వచ్చిన వాహనాలకు, ఆశ్రమవాహనాలకు పూజ చేసారు. ఈసారి ఒక కొత్త బైక్ ఆశ్రమం కోసం కొనటంతో ఆ కొత్త బండిపైన ఒక్క నిమిషమైనా ఎక్కాలన్న ఉత్సాహంతో పిల్లకాకులన్నీ అక్కడే వాలిపోయి, పొట్టలో గంట కొట్టినా పట్టించుకోకపోవటం విశేషం. రాత్రి శ్యామలా దండకంతో స్తుతి జరిగింది.

14వ తేదీ ఉదయం శ్రీ సాయి మహిషాసురమర్దనికి విశేషపూజ జరిగింది. అన్నపూర్ణాష్టకం, శ్రీ శారదాస్తుతి, మహిషాసుర మర్దినీ స్తోత్రం పిల్లలంతా ఏకకంఠంతో చదివి నమస్కరించుకొన్నారు శ్రీ సాయిరూపం లోని అమ్మవారికి. సాయంత్రం శమీ దర్శనం, పెద్దలకు నమస్కరించి ఆశీస్సులందుకోవటం యథావిధిగా జరిగాయి. 15వ తేదీ ఏకాదశి. సాయినాథుల వారు విజయదశమి, ఏకాదశుల సంగమవేళలో అక్టోబరు 15వ తేదీన సమాధి చెందారు. అందుచేత ఏకాదశి అక్టోబరు 15నాడు సాయి సమాధి ఉత్సవం నిర్వహించాలనుకొన్నాము. ఎప్పటి మాదిరిగానే సమాధి నిర్మాణం (తాత్కాలిక ప్రాతిపదికన) చేసి దానిని మామిడి తోరణా లతో, రకరకాల రంగురంగుల పూలతో, దీపాలతో అలంకరించారు. శ్రీ సాయినాథుల వారు "ఇది నా సీమోల్లంఘనం" అనాటి నుంచీ వారి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలన్నీ వివరంగా జ్ఞాపకం చేసుకొంటూ పెద్దలు వివరించి చెప్పారు. సమాధిలాగా ఉన్న కట్టడాన్ని 1918లో షిరిడీలో బాబాకు కట్టిన సమాధిగానే భావించి, లోపల స్వామి శయనించి ఉన్నారని భావించి, ఏకాగ్రచిత్తంతో సాయినామం పలుకుతూ మూడు ప్రదక్షిణలు చేయవలసిందిగా భక్తులకు చెప్పారు. సాయిసమాధి సజీవచైతన్యనిధి అనీ, మధ్యాహ్న హారతి వేళ నేటికీ అక్కడ ప్రకంపనలు వస్తుంటాయనీ వివరించటంతో భక్తులంతా నిశ్శబ్దంగా ప్రదక్షిణలు





చేసుకొని నమస్కారాలు చేసారు. మిగిలిన వారంతా మంద్రస్వరంతో సాయినామం చెప్తూ ఉన్నారు. తరువాత మహాహారతి, అటుపైన ప్రసాద వితరణ జరిగాయి.

శ్రీ సాయినాథ క్షేత్రం (మైనేనివారి పాలెం)లో కూడా శ్రీ సాయి సమాధి ఉత్సవం చక్కగా జరిగింది. పరిసర గ్రామాలనుంచీ వచ్చిన మూడున్నర వందల మంది భక్తులతో ఆలయం నిండిపోయింది. శ్రీ సాయి పూజ బాబా వారికి జరిగాక సమాధి పూజ జరిగింది. పుష్పాలంకరణతో ఉన్న సమాధికి ప్రదక్షిణలు జరగకముందు శ్రీ సాయినిర్యాణం గూర్చిన విషయాలను శ్రీ సాయి సచ్చరిత్ర నుండీ శ్రీ యల్లాప్రగడ భాస్కరప్రసాద్ చదివి వినిపించారు. భక్తులంతా ప్రేమతో, గౌరవంతో, నామజపంతో ప్రదక్షిణలు చేసారు. పూజలు పుట్టగుంట సాయిరమణ, భాస్కరప్రసాద్‌లు నిర్వహించగా-ఆనాటి అతిథి సత్కారం, భోజనాదికాల ఏర్పాట్లు శ్రీమతి విజయలక్ష్మి టీచరుగారు చూచుకొన్నారు.

అక్టోబరు 21వ తేదీ అట్లతద్ది. ముందరిరోజు రాత్రే ఆడపిల్లలంతా గోరింటాకు కోసి రుబ్బి కాళ్లకూ, చేతులకూ రకరకాలుగా పెట్టుకొని పండించుకున్నారు. పారిజాతం పువ్వుల్లాటి వేళ్లు, ఎర్రగా పండిన అరిచేతులు మళ్లీ మళ్లీ చూచుకొని మురిసిపోయారు చైత్రా, సుధీరాను అంటే ఏడు, ఆరు ఏళ్లే. తెల్లవారుజామునే లేచి గబగబ స్నానాలు చేసి వచ్చారు అందరూ. కాళ్లకు పసుపు పూసుకొని, బొట్లు పెట్టుకొని దేవుడిముందు దీపం పెట్టుకొన్నారు. మంజులక్క కొంచెం అనారోగ్యంగా ఉంది. అందుకని పాపాయక్క, గీతక్క ముందుగా అన్నం వండి కాస్త పులిహోర కలిపారు. మంజులక్క పొట్లకాయ వేయించింది. ఆడపిల్లలంతా వేడివేడి అన్నంలో పొట్లకాయ కూర, గోంగూర పచ్చడి కలుపుకొని తిన్నారు. పులిహోర తిన్నాక, మంచి మీగడ పెరుగన్నం తింటూ ఆ తెల్లని పెరుగు మధ్య ఎర్రగా మెరిసే తమ వేళ్ల సోయగానికి తామే ముచ్చటపడిపోయారు.

అప్పటికి తూరుపు తెల్లబడుతోంది. అందరూ పొలోమని ఉయ్యాలల దగ్గరకు (అన్నలు ముందరి రాత్రే ఏర్పాటు చేసారివి) పరుగెత్తారు. ఏడు గంటలదాకా వంతులవారీగా ఉయ్యాలలూగుతూ గడిపారు. ఒడుల నిండా పైట కొంగుల నిండా పున్నాగపూలు నింపుకొని ఇంట్లోకి వచ్చారు. అవన్నీ చకచక మాలికలల్లి గుడిలోకి పరుగెత్తుకు వెళ్లి స్వామికి సమర్పించుకొని, హారతి తీసుకొని, ప్రదక్షిణలు చేసి వచ్చి, యిక స్కూలుకు వెళ్లే ప్రయత్నాలలో పడ్డారు. సాయంత్రం 6 గంటలకు ఉమా పూజ చేసుకొని, అమ్మవారికి అట్లు నివేదన పెట్టి, హారతులెత్తి నమస్క రించారు. అటుపైన అందరికీ అట్లు, పచ్చడి వడ్డించి, తమ ఉత్సవం పూర్తి చేసుకొన్నారు. తెల్లవారుజాము నుంచీ వీళ్లను, వీళ్ల ఉత్సాహాన్నీ, ఉయ్యాల లనూ చూచి "ఏం-ఆడపిల్లలకే ఎందుకుండాలీ యీ పండుగ!" అని ఉడుక్కొంటున్న మగ పిల్లలందరూ కంచాలలో అట్లు చూడగానే అవన్నీ మర్చిపోయి వాటి పని పట్టడంలో పడిపోయారు. అలా అట్లతద్దె పూర్తయింది.

నవంబరు రెండవ తేదీ నరక చతుర్దశి. పిల్లలు ఇళ్లూ వాకిళ్లూ శుభ్రం చేయటం, పూజాదికాలు చేయటం వగైరాలన్నీ మామూలుగానే చేసుకున్నారు. నరకాసురుడి బొమ్మ చేసి దాని పొట్టలో టపాకాయలు పెట్టి దహనం చేసారు. దీపావళినాడు పిండివంటలు, దీపతోరణాలు, బాణా సంచాలు అన్నీ మామూలుగానే నడిచాయి. కానీ, ఇవన్నీ పిల్లల కోసమే తప్ప పెద్దలందరిలోనూ ఉత్సాహం, చైతన్యం కొరవడ్డాయి. రాష్ట్రంలో శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాలు వరద తాకిడికి లోనై అతలాకుతలం అయిపోయి ఉండటం, ఆప్తులైనవారు కొందరు వరుసవరుసగా మరణించటం, అనారోగ్యాలు......... మొత్తం మీద ఏదో అయిందనిపించడమే గానీ దీపావళి గొప్ప ఆనందాన్నేమీ యివ్వలేదు సాయిధామానికి ఈసారి.

నవంబరు 7వ తేదీన రేపల్లె, హైదరాబాదు భక్తులు, 8వ తేదీన దామెర చెర్ల భక్తులు సాయిధామానికి వచ్చి, పరమపూజ్య గురుదేవుల ద్వారా





శ్రీ సాయి (మండల) దీక్షలు, హోమపూర్వకంగా తీసుకున్నారు. సాయి ప్రసాదం స్వీకరించి వెళ్లిపోయారు.

నవంబరు 6వ తేదీన శ్రీ వివేకానంద స్వామి 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా సాయిధామం ఆశ్రమం నిర్వహిస్తున్న బొమ్మల రామవరం మండల స్థాయి క్రీడా, సాంస్కృతిక విషయాల పోటీలు ప్రారంభ మైనాయి. ప్రారంభోత్సవంలో నల్గొండ డిప్యూటీ డి.ఇ.ఓ. శ్రీ మదన్‌మోహన్ గారు, విద్యారంగంలో గత ఏభై సంవత్సరాలుగా విద్యార్థులలో సంస్కార శక్తిని పెంచే ప్రయత్నం చేస్తున్న శ్రీ గడ్డం నరసింహారెడ్డిగారు, మండల పోలీసు సబ్‌ఇన్స్‌పెక్టర్ శ్రీ వేంకటేశ్వర్లుగారు, ఎం.ఈ.ఓ. శ్రీమతి మాలతిగారు ముఖ్యఅతిథులుగా పాల్గన్నారు. మండల హైస్కూళ్ల ప్రధానో పాధ్యాయులు, క్రీడా సంబంధిత ఉపాధ్యాయులు, తెలుగు పండితులు, సహాయక ఉపాధ్యాయులు పిల్లలతో వచ్చారు. మాన్యమిత్రులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్.మంగారెడ్డిగారు విశ్రాంత తెలుగు అధ్యాపకులు శ్రీ కె. చంద్రారెడ్డిగారు ఈ క్రీడలకు ఆశ్రమం తరఫున నిర్వాహకులుగా పనిచేయగా బొమ్మలరామవరం ప్రధానోపాధ్యాయులు శ్రీ పురుషోత్తమరెడ్డిగారు గణనీయమైన సహకారాన్ని అందించారు.

పరమపూజ్య గురుదేవుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన యీ సమావేశంలో మాతా శుకవాణి అతిథులకు స్వాగతం పలికారు. స్వామివారి ఆశీస్సుల తదుపరి శ్రీ మదన్‌మోహన్‌గారు మాట్లాడుతూ యిలాంటి క్రీడోత్సవాల ప్రాధాన్యం గురించి వివరించారు. సాయిధామం యీ విషయంలో చేస్తున్న కృషిని అభినందించి, ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల, జిల్లా స్థాయి పోటీల తేదీలను వివరించారు. ఆహూతులందరూ విద్యాలయాలు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనటం వలన ప్రయో జనాలను ఉటంకిస్తూ తమ అభినందనలు తెలిపారు. చివరిగా ఉత్సవా రంభానికి గుర్తుగా ఒక భజన చెప్పించారు. చి॥సాయినందన్, చి॥ సాయి

తేజస్విని. సాయిధామ బాలికలు కోలాట ప్రదర్శన చేసారు. అటుపైన ఏక పాత్రాభినయం, వక్తృత్వం, వ్యాసరచనలలో పోటీలు నిర్వహింపబడ్డాయి.

7వ తేదీ ఉదయం దేశభక్తి గేయాలలో పోటీ జరిగింది. అందులో చీకటిమామిడి, బొమ్మల రామవరం, ఎ.పి. మోడల్ స్కూలు (బొ.రా) మాతృశ్రీ పాఠశాల (బొ.రా) జలాల్‌పూరు, రామలింగంపల్లె, మేడిపల్లి, నలందా పాఠశాల, నాగినేని పల్లె, సాయిధామం, మర్యాల, తిమ్మాపురం- మొత్తం పన్నెండు పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థుల మధ్య దేశభక్తి గేయాల పోటీ జరిగింది. అటుపైన వివిధ టీమ్‌ల మధ్య కబడ్డీ, కోకో, వాలీబాల్ ఆటలలో పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల క్రీడోపాధ్యాయులందరూ యీ కార్యక్రమం నిర్వహించి, ఫైనల్స్ 8వ తేదీకి వాయిదా వేసారు.

8వ తేదీ ఉదయం వాలీబాల్, కబడ్డీ, కోకోల పోటీలు, కోలాటం పోటీలు నిర్వహింపబడ్డాయి. మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతాలలో 'సాయికళ్యాణి' ఆడిటోరియంలో ముగింపు సమావేశం ప్రారంభమైంది. గతంలో సిక్కిం గవర్నర్‌గా పనిచేసిన ఆంధ్రులు, దేశభక్తులు శ్రీ రామారావు గారు ప్రధాన అతిథిగా వచ్చారు. కానీ అత్యవసర సమావేశం మరొకటి నాలుగు గంటలకే ఉండటంతో త్వరగా వెళ్ళిపోయారు. 'దేవాలయ పరిరక్షణ సమితి' అధ్యక్షులు, మంచి దేశభక్తులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ కమలానంద భారతీస్వామివారు ముఖ్య వక్తగా విచ్చేసారు. పరమపూజ్య గురుదేవుల అధ్యక్షతన జరిగిన యీ సమావేశంలో గురుదేవులు ఆశీస్సులందించాక శ్రీ కమలానంద భారతీస్వామి పిల్లల నుద్దేశించి చక్కని ఉత్తేజకరమైన ఉపన్యాసం యిచ్చారు. కోడి, కుక్క, నెమలి, కోకిల, తూనీగ - యిలా ప్రతి దానికీ భగవంతుడు ఒక్కొక్క నైపుణ్యాన్నిచ్చాడనీ, మానవుడు వాటన్నిటినీ తనలోకి పొదువుకోగలంత శక్తిమంతుడనీ, అతను ఎలాటి విషయాలు స్వీకరించగలిగితే అలా తయారవుతాడనీ, వివేచన ఉపయోగించి ముందుకు సాగాలనీ ప్రబోధించారు. దేనికీ ఎన్నడూ కరువెరుగని భరతభూమికి - జ్ఞాననిధి అయిన భరతభూమికి వారసులుగా ఎదగమని ఆశీర్వదించారు. తరువాత అతిథి సత్కారం జరిగింది. ఆహూతులను శాలువలతో సద్గ్రంథాలతో ఫలపుష్పాలతో సత్కరించారు. విశేష సహకారాన్ని అందించిన పురుషోత్తమరెడ్డిగారిని, శ్రీ మంగారెడ్డిగారిని, శ్రీ కె. చంద్రారెడ్డి గారిని కూడా అలాగే సత్కరించారు. ఈ మండల ఎం.ఇ.ఓ. శ్రీమతి మాలతి గారికి అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులతో వచ్చిన ఉపాధ్యాయులకు-అందరికీ కూడా మొత్తం నలభైకి పైగా జ్ఞాపికలు, సద్గ్రంథాలు అందజేసారు. ఆది నుండీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటమే గాక మంచి సహకారం అందించిన శ్రీ ధర్మేంద్ర మాస్టారికి గురుదేవుల విశేషఆశీస్సులు లభించాయి.





అటుపైన వివిధ పోటీలలో గెలుపొందిన వారందరికీ బహుమతి ప్రదానం పరమపూజ్య గురుదేవులు, శ్రీశ్రీశ్రీ కమలానంద భారతీస్వామి వారి కరకమలాల మీదుగా జరిగింది. అలాగే యీ పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ కూడా జ్ఞాపికలు అందజేయబడ్డాయి. వందన సమర్పణతో ఉత్సవం ముగిసింది.

6,7,8 తేదీలు-ఈ మూడు రోజులకు ముందర మూడురోజుల నుండే ఆశ్రమ ఉపాధ్యాయులు, ఆశ్రమంలోని బాలబాలికలందరూ ఎంతో శ్రమించారు. కార్యక్రమం మూడు రోజులలోనూ పిల్లలను పోటీలకు తయారుచేయటంలోనూ ఆడించే సమయాలలోనూ, పోటీలలో పాల్గొన్నందరికీ వంటలు చేసేటప్పుడూ, వడ్డించేటప్పుడూ అన్నిటా తామై ప్రతిచోటా వేకువ నుండీ రాత్రి పదింటిదాకా శ్రమించి పనిచేసిన సాయి విద్యాధామం టీచర్లు శ్రీ ఎన్.నరేశ్, శ్రీ వై.శ్రీనివాస్‌లకు, వారికి సహకారమిచ్చిన శ్రీ నరసింహకు కుమారి వి. కవితకు ప్రత్యేక అభినందనలు అందించింది సాయిధామం. తదితర మా ఉపాధ్యాయినీ,

ఉపాధ్యాయులందరూ కూడా ఎక్కడ ఏది అవసరమైన ఉరకలు పరుగుల మీద హాజరవుతూ ఎంతో సహకరించారు. వారందరికీ జ్ఞాపికలు, పుస్తకాలు ఇచ్చి సత్కరించింది సాయిధామం. వంటగదిలో వంటాయనకు సహకారంగా (పాపం-ఆటలు చూడాలని మనసు ఎంత పీకుతున్నాగానీ) నిలబడిన చి॥సాయి భరత్(గున్ను)కు, రామన్నకు- తదితరులకు గురుదేవులకు ఏమి కావాలన్నా తోడుగా నిలబడిన చి॥ సాయిచంద్ర (చిట్టి)కు ఆశీస్సులతో మంచి గ్రంథాలిచ్చారు గురుదేవులు. రాత్రి పదిన్నరదాకా పెద్ద పే....ద్ధ గిన్నెలు, హండాలు, మూడొందల కంచాలు, గ్లాసులు తోమి బోర్లించుకొని (పనిమనుషులతో కాదు-స్వయంగా పిల్లా, మేకా, పెద్దా అంతా కలిసి తోమి) హమ్మయ్య!" అని ఓ దీర్ఘనిశ్వాసం వదిలి నిద్రబోయింది సాయిధామం.

నవంబరు 10వ తేదీ ఉదయం పది గంటలకు గురుదేవులు చెర్లపల్లిలోని జైలులో శిక్ష అనుభవిస్తున్న వారికి తమ మంగళాశీః ప్రసంగామృతాన్ని దయ చేసారు. మానవజన్మ ప్రాశస్త్యాన్నీ, దాన్ని పదిలంగా నడుపుకోవలసిన ఆవశ్యకతనీ వివరించారు. ఒక జైనగాధని వినిపించి తొందరపడి ఏ పనీ చేయరాదనీ, ప్రతి పని చేసే ముందు కూడా 'ఇది ఎటువంటి పర్యవసానాలకు దారితీస్తుంది?" అని ఆలోచించుకొనిమరీ చేయాలనీ, ఆవేశం అనర్థదాయకమవుతుందనీ, ప్రేమ, స్నేహం, కరుణ వంటి మానవీయ గుణాలు జీవితాలకు వెలుగునిస్తాయనీ' సరళ సుందరంగా బోధించారు. జైల్ సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరెంటెండెంట్, సేవా భారతి సభ్యులు-ఇంకా .... తదితరులందరూ కూడా ఎంతో గౌరవంగా గురుదేవులను ఆహ్వానించటం, కార్యక్రమ నిర్వహణ, వీడ్కోలు కూడా చక్కని సంస్కారాయుతమైన రీతిలో ఆచరించి గురుదేవుల ఆశీస్సులకు పాత్రులైనారు.





# సాయితో తర్ఖడ్ స్మృతులు-7

**- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్**

**(గత సంచిక తరువాయి)**

తర్ఖడ్ కుటుంబం వారి అనుభవాల భాండాగారాన్ని నేను మీ ముందు ఉంచాను. ఇవన్నీ చదివిన తరువాత బాబా మీద మీ నమ్మకం రెట్టింపు అవుతుందని నాకు బాగా తెలుసు. ఇపుడు మనం సాయి సచ్ఛరిత్రలోని అనుభవాలు చూద్దాము. సాయి సచ్ఛరిత్రలోని 9వ అధ్యాయం వైపు నేను మీ దృష్టిని మరలుస్తున్నాను. మన పాఠకులందరూ కూడ ఈ పవిత్రమైన పుస్తకంతో ఎంతో జ్ఞానవంతుతోని లయినారని నేను భావిస్తున్నాను. వారు ఒక్క సారయినా శ్రీ సాయి సచ్చరిత్రని చదివి ఉంటారు. ఒకవేళ ఎవరయినా అలా చేయకపోతే నా వినమ్రమైన అభ్యర్థన ఏమిటంటే దయచేసి చదవండి. అది షిరిడీ సాయిబాబా వారి జీవితాన్ని గురించి చాలా చక్కగా వివరిస్తుంది. అనేకమైన లీలలను ఆయన షిరిడీలో తను ఉన్న కాలంలో తన భక్తులకు దర్శింపజేశారు.

ఈ పవిత్ర గ్రంథంలోని 9వ అధ్యాయం యెక్కువ భాగం తార్ఖడ్ కుటుంబం గురించి వివరిస్తుంది. అంటే మా నానమ్మగారు మా తాత గారయిన 'రామచంద్ర ఆత్మారాం తార్ఖడ్ అనబడే బాబా సాహెబ్ తార్ఖడ్, యింకా మా నాన్నగారు జ్యోతీంద్ర రామచంద్ర తార్ఖడ్. ఇంతకుముందు వివరించినట్లుగా తార్ఖడ్ కుటుంబం విపరీతమయిన ప్రార్థనా సమాజ్ వాదులు. వారు విగ్రహారాధనని నమ్మేవారు కాదు. ఆ కారణం చేత వారికి దేవునియందు నమ్మకం లేదు. ఏమయినప్పటికి వారి అదృష్టం వారిని షిర్డి సాయిబాబాతో బంధం ఏర్పడటానికి తీసుకువచ్చింది. అప్పడది ఒక గొప్ప మార్పు. అందుచేత ప్రముఖ ఆరతి కూడ చెప్పేది ఏమిటంటే బాబా,

ఆయన నాస్తికుణ్ణి కూడా ఆస్తికుడిగా మార్చగలరని (నాస్తికా నహితూ లావిషి నిజభజని) తార్ఖడ్ కుటుంబంలో యిది అనుభవపూర్వకంగా నిరూపితమయింది.

సాయి సచ్చరిత్ర రచయిత స్వర్గీయ శ్రీ అన్నా సాహెబ్ ధబోల్కర్‌గారు తమ 9వ అధ్యాయంలో గొప్ప భక్తుడైన కుమారుడు ఉన్నందుకు బాబా సాహెబ్‌గారు చాలా అదృష్టవంతులని చెప్పారు. మా నాన్నగారు ఉదయం 4 గం.లకే లేచి స్నానం చేసిన తరువాత యింటిలో తన మందిరంలో ఉన్న బాబా ఫొటోకి చందనం అద్ది, బాబాకి ఆరతి యిస్తూ ఉండేవారు. ఆయన అయిదు వత్తుల వెండి దీపాన్ని (నిరంజన్) వెలిగించి అందులో బాబా యిచ్చిన ఒకపైసా నాణేన్ని ఉంచేవారు. ప్రతిరోజు ప్రసాదంగా పటిక బెల్లాన్ని సమర్పిస్తూ ఉండేవారు. మధ్యాహ్నం భోజన సమయంలో దానిని వారందరూ స్వీకరిస్తూ ఉండేవారు.

పూజ అయిన తరువాత తండ్రీ కొడుకులిద్దరూ బైకుల్లాలోని టెక్స్‌టైల్ మిల్‌కి వెడుతూ ఉండేవారు. బాబా దయవల్ల ఆ రోజుల్లో మా తాతగారు నెలకు రూ.5,000/-, మా నాన్నగారు నెలకు రు.2000/- జీతం సంపాదిస్తూ ఉండేవారు. ఒకసారి మా తాతగారికి బాబాగారు కఫ్నీలు కుట్టించుకోవడానికి కాటన్ తానులు పంపిద్దామనే కోరిక కలిగింది. ఆయన జ్యోతీంద్రతో, తల్లితో కూడా షిరిడీ వెళ్ళి బాబాకు నమస్కరించి రమ్మని చెప్పారు. కాని యింటిలో పూజ ఎవరు చేస్తారనే కారణం చేత జ్యోతీంద్రగారు యిష్టపడలేదు.

అపుడు మా తాతగారు ఆ బాధ్యతను తాను తీసుకొని జ్యోతీంద్ర చేసినట్లే తాను కూడా చేస్తానని అందులో ఎటువంటి లోటు జరగనివ్వనని హామీ యిచ్చారు. ఆ హామీతో మా నాన్నగారు తన తల్లితో షిరిడీకి బయలుదేరారు. తరువాత రెండు రోజులు బాగానే గడిచాయి. కాని మూడవ రోజున మా తాతగారు పూజా సమయంలో కలకండ





పెట్టడం మరచిపోయారు. భోజనం చేసే సమయంలో తన పళ్ళెంలో కలకండ లేకపోవడంతో మధ్యాహ్నానికి ఆయనకు తన తప్పు గుర్తుకు వచ్చింది. ఆయన వెంటనే లేచి షిర్డీలో ఉన్న జ్యోతీంద్రకి తాను చాలా పెద్ద తప్పు చేసానని బాబాగారిని క్షమించమని అడగమని కోరుతూ ఉత్తరం వ్రాశారు. అక్కడ షిరిడీలో అదే సమయంలో ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగింది. ద్వారకామాయిలో మధ్యాహ్న హారతి అయిన తరువాత మా నానమ్మగారు, బాబాగారి దగ్గరకు ఆయన ఆశీర్వాదములు తీసుకోవడానికి వెళ్ళినప్పుడు బాబా మా నానమ్మగారితో "అమ్మా! ఈ రోజు నాకు చాలా ఆకలిగా ఉంది. ఎప్పటిలాగే నేను బాంద్రా వెళ్ళాను. తలుపుకి తాళం వేసి ఉండటం చూశాను. కాని నన్నెవరూ ఆపలేదు. ఎందుకంటే తలుపుకి ఉన్నచిన్న ఖాళీ గుండా ప్రవేశించాను. కాని తినడానికి ఏమీ లేకపోవడంతో పూర్తిగా నిరాశ చెంది ఖాళీ కడుపుతో తిరిగిరావల్సి వచ్చింది" అన్నారు. బాబా చెపుతున్నదేమిటో మా నానమ్మగారికి అర్థం అవలేదు. కాని మా నాన్నగారు ఉదయం పూజా సమయంలో బాబాకి ప్రసాదం పెట్టకపోవడం తన తండ్రి చేసిన పెద్ద తప్పు మన్నించమని కోరారు. వెంటనే ముంబాయి వెళ్ళడానికి అనుమతినిమ్మని అడిగారు. బాబా అనుమతినివ్వక యింకా కొన్ని రోజులు ఉండమన్నారు. ఏమయినాగానీ, మా నాన్నగారు అస్థిమితంగా ఉన్నారు. ఆయన బాబా చెప్పినదంతా వివరంగా తన నాన్నగారికి ఉత్తరం వ్రాశారు. రెండు ఉత్తరాలు ఒకదానికొకటి దాటుకొని వారికి చేరగానే వాటిని చదివిన తరువాత తండ్రీ కొడుకులిద్దరికీ కన్నీరు వచ్చింది. తమ మీద బాబాకున్న అపరిమితమైన ప్రేమ తెలిసి వచ్చింది. అలా బాబా ఆ ఫొటో ఫ్రేములో తాను సజీవంగా ఉన్నాననీ, ప్రతిరోజు వారు సమర్పించే నైవేద్యాలను తప్పకుండా స్వీకరిస్తున్నామని గుర్తు చేశారు.

ఒకసారి షిరిడీలో ఉన్నప్పుడు మా నానమ్మగారు భోజనం చేసే

ముందు ఒక కుక్క తోకాడించుకుంటూ వచ్చింది. మా నానమ్మగారు దానికి ఒక చపాతీ ముక్క పెట్టారు. ఆ కుక్క సంతోషంతో తిని అక్కడినుంచి వెళ్లిపోయింది. కొంచెంసేపటి తరువాత అక్కడికి ఒళ్లంతా అశుద్ధంతో నిండిఉన్న వరాహం ఒకటి అక్కడికి వచ్చింది. సాధారణంగా అటువంటి అసహ్యకరమైన ప్రాణిని చూసినప్పుడు ఎవరూ గొంతులో ఉన్న ముద్దని మ్రింగలేరు. కాని మా నానమ్మగారు చాలా దయగల వారు. దేవుడంటే భయం కలది. ఆమె ఆ అసహ్యకరమైన వరాహానికి కూడ చపాతీ ముక్కని పెట్టారు. ఆ వరాహం చపాతీముక్కను తిని వెళ్లిపోయింది. తరువాత ఆమె ద్వారకామాయికి వెళ్లి బాబాకి దగ్గరగా వెళ్లారు. బాబా ఆమెతో అమ్మా! ఈ రోజు నువ్వు నీ చేతులతో దివ్యమైన విందుభోజనం పెట్టావు. నాకింకా త్రేనుపులు వస్తున్నాయి" అన్నారు. అది విని మా నానమ్మగారు ఆశ్చర్యపోయారు. ఆమె బాబాతో "బాబా మీరు పొరబడ్డారు. షిరిడీలో నేను మీకెప్పుడూ భోజనం పెట్టలేదు. నేనిక్కడ వంట కూడా వండలేదు. నిజానికి నేనిక్కడ 'సగుణ' నడిపే హొటల్‌లో డబ్బు చెల్లించి భోజనం చేస్తున్నాను" అన్నారు. అమ్మా! ఈ రోజు మధ్యాహ్నం నువ్వు భోజనం చేసే ముందు ఒక కుక్కకి, ఆ తరువాత వచ్చిన అశుభ్రంగా ఉన్న వరాహానికి తిండి పెట్టలేదా? ఆ ఆహారం నాకు చేరింది" అన్నారు. అప్పుడు మా నానమ్మగారు "బాబా, దీనర్థం నీవు ప్రాణుల రూపాలలో వచ్చి నీ భక్తులను పరీక్షిస్తూ ఉంటావు" అన్నారు. బాబా ఆమెతో - 'అమ్మా దయచేసి ఈ ప్రాణుల మీద అలాగే దయ చూపుతూ ఉండు. భగవంతుడు నిన్ను దీవిస్తూ ఉంటాడు. భగవంతుడు నీ యింటిలో ఆహారానికి కొరత లేకుండా చూస్తాడు" అన్నారు.


శ్రీ సాయిబాబా లీలలకు ఇదొక చక్కని తార్కాణం కాదా?

**(సశేషం)**





# శ్రీ గజానన విజయం



**- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు**

**(గత సంచిక తరువాయి)**

## రెండవ అధ్యాయము

గజానన మహారాజు తప్పించుకు పారిపోయారు. ఆయనను అలా కోల్పోయినందుకు బంకట్ లాల్ ఎంతో ఖిన్నుడైనాడు. ఆకర్షణీయమైన ఆయన రూపమే నిరంతరం అతని కళ్లముందు తారట్లాడుతున్నది. అతడు ఆ సాధు మహరాజు కోసం ఊరంతా గాలించాడు. కాని ఎక్కడా కన్పించలేదు. విచారవదనంతో యింటికి చేరాడు. అతని విచారాన్ని గమనించిన తండ్రి కారణమడిగినా అతడు ఏమీ మాట్లాడలేదు.

బంకట్‌లాల్ యువకుడూ, ఆరోగ్యవంతుడూ, సంపన్నుడూ కూడా. నిజానికి విచారపడటానికి కారణాలేవీ లేవు. అయినా ఏదో బాధతో అతడు గ్రామస్తుడూ-కొంచెం వయస్సులో పెద్దవాడూ అయిన రామాజీ దేశ్‌ముఖ్ అనే పెద్దమనిషితో జరిగిన విషయమంతా చెప్పాడు. ఈ యువకుని మనస్సు మీద యింతగా ముద్ర వేశాడంటే ఆయన ఎవరో గొప్ప యోగియే అయి ఉండవచ్చునని అతడు భావించాడు.

ఆ ప్రాంతాలలో గోవింద బువా టాకలికర్ అనే ఒక హరికథకుడు ఉండేవాడు. ఆయన కథాగానం చెయ్యటానికి షేగాం వచ్చాడు. ఊరి శివాలయంలో హరికథ ఏర్పాటు చెయ్యబడింది. పీతాంబరుడనే దర్జీతో కలిసి బంకట్‌లాల్ కథ వినటానికి దేవాలయం వైపు నడుస్తూ తాను చూచిన మహాత్ముని గురించి వివరిస్తున్నాడు. ఇంతలో హఠాత్తుగా ఆ మహాత్ముడు పేవ్‌మెంట్ మీద కూర్చొని ప్రత్యక్షమయ్యాడు. ఏదో నిధిని చూసినంత ఆత్రంగా వారిద్దరూ పరుగెత్తి వారిని సమీపించి నమస్కరించి వినయంగా, "తినటానికి ఏమైనా తెమ్మంటారా?" అని

అడిగారు. తోటమాలి కులానికి చెందిన ఒక స్త్రీ యింటినుండి ఉల్లిపాయ మొదలైన వాటితో కలిపి వండిన సెనగపిండి పిష్టాన్ని తెమ్మని చెప్పారు ఆయన. బంకట్‌లాల్ అలాగే తెచ్చి యిచ్చిన తరువాత వారు ఒక సొరకాయ బుర్రను యిచ్చి దగ్గరలోనే సన్నగా పారుతున్న కాలువ నుండి నీరు తెమ్మని చెప్పారు. పీతాంబరుడు సందేహిస్తూ "ఆ సొరకాయ బుర్ర మునిగేటంత లోతు నీళ్లు ఆ కాలువలో లేవనీ అదీగాక ఆ ఉన్న నీళ్లను కూడా బురదలై త్రాగటానికి పనికిరానివనీ చెప్పాడు.

"ఏమైనా ఆ నీళ్లే కావాలి. ఈ సొరకాయ బుర్రని దాంట్లో ముంచు. దోసిళ్లతో తీయబోకు" అన్నారు స్వామి. పీతాంబరుడు ఎంతో యిబ్బందిగా ఆ పిల్లకాలువలోకి వెళ్లాడు. ఆ నీళ్లు అతని పాదాలు తడిసేంత లోతులోనే ఉన్నాయి. అయిష్టంగానే అతడు ఆ బుర్రను నీటిలో ముంచాడు. ఆశ్చర్యం-అది పూర్తిగా మునగటమే కాదు స్వచ్ఛమైన జలంతో నిండింది కూడా.

పీతాంబరునికి అంతా అయోమయంగా ఉంది. రెండంగుళాల లోతు గూడా లేని కాలువలో యింత పెద్దబుర్ర ఎలా మునిగింది. బురద బురదగా ఉన్న నీరు యింత స్వచ్ఛంగా ఎలా మారింది? ఏమైతేనేమి యిది ఆ స్వామి మహిమే అని అనుకుంటూ ఆ నీళ్ళు తెచ్చి యిచ్చాడు. ఆ స్వామి అంతకుముందు తెప్పించుకొన్న పదార్థం తిని ఆ నీళ్ళు త్రాగాడు.

అప్పుడు స్వామి యిలా అన్నాడు "బంకట్‌లాల్! ఎవరి ఇంటి నుంచో తెచ్చిన ఆహారంతో నన్ను తృప్తుడిని చేద్దామనుకుంటున్నావా? అదేం కుదరదు. నీ జేబులో పోకలున్నాయి. ఒకటి బయటకు తీసి ముక్కలు చేసి నాకివ్వు" అన్నారు. అతడు సంతోషంతో అలాగే చేస్తూ హైదరాబాదు సంస్థానానికి సంబంధించిన రెండు రాగిపైసలు కూడా దక్షిణగా సమర్పించబోయాడు.

"నేనేమన్నా వ్యాపారిననుకొన్నావా"-అలా డబ్బులిస్తున్నావు! నాకవేమీ అక్కరలేదు. నేను పూర్ణభక్తినే యిష్టపడతాను. నీలో నాకది కన్పించింది. కనుకనే మనం మళ్లీ కలుసుకున్నాము. సరే మీరు గుడిలోకి వెళ్లి హరికథ





వినండి. నేనదిగో-ఆ వేపచెట్టు క్రింద కూర్చుంటాను" అన్నాడు స్వామి.

ఆ స్నేహితులిద్దరూ గుడిలోకి వెళ్లేటప్పటికి హరికథ సగంలో ఉంది. అది భాగవతం. ఏకాదశ స్కంధంలోని హంసగీత. అయితే మిగిలిన సగం కథనీ వేపచెట్టు క్రింద కూర్చున్న స్వామివారు చక్కని కంఠంతో శ్రావ్యంగా పాడారు. తన గానం ఆపివేసి ఆ గానం శ్రద్ధగా విన్న గోవింద బువా ఆ విషయం చెప్పడానికి ఆ స్వామికే గొప్ప సమర్థత ఉన్నదని భావించి వారిని గుడిలోనికి ఆహ్వానించమని చెప్పాడు. బంకట్‌లాల్, పీతాంబర్ మరికొందరు భక్తులు వెళ్లి స్వామివారిని సభామంటపం దగ్గరకు రమ్మని ప్రార్థించారు. కాని ఆ స్వామి ఏమాత్రం కదలలేదు. గోవిందబువా స్వయంగా అక్కడికి వచ్చి ప్రాధేయపడ్డాడు.

"స్వామీ మీరు సాక్షాత్తు శివావతారంగా కన్పిస్తున్నారు. దయచేసి శివాలయంలోకి వేంచేయండి. మీరు లేకుండా ఆ గుడి ఒక గుడే కాదు. భగవంతుని కీర్తించటమే సాధనగా స్వీకరించిన నా జన్మ నేటికి తరించింది. మీ దర్శన భాగ్యం కలగటానికి అదే కారణం. దయచేసి గుడిలోకి రండి స్వామీ"

స్వామి చిరునవ్వుతో అన్నారు "గోవిందా యింతకుముందు నీ కథా గానంలో 'భగవంతుడు సర్వాంతర్యామి'అని స్వయంగా నీవే చెప్పావు గదా! దాన్ని నీవు నమ్మటంలేదా! నీ మాటలకు, చేతలకూ తేడా ఉండ వచ్చునా? వెళ్ళు, వెళ్లి ఆ కథాగానం పూర్తి చెయ్యి, నేనిక్కడ నుండే వింటూ ఉంటాను".

గోవింద బువా గుడిలోకి వెళ్లి అందరూ వినేటట్లు గొంతెత్తి యిలా ప్రకటించాడు-"ఓ షేగాం వాసులారా! మీరిప్పుడు ఒక అనర్ఘ మణిని సంపాదించిన అదృష్టశాలురు. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోండి. ఇప్పడిది షేగాం కాదు. నిజంగా పండరీపురమే. పాండురంగడే స్వయంగా ఇక్కడకు విచ్చేసి ఈ భూమిని పవిత్రపరచాడు. వీరిని శ్రద్ధగా సేవించుకోండి" అటుపై అతడు తన సంకీర్తనను ముగించాడు.

**(సశేషం)**